షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL/2023/89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 333 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 6 జనవరి 2025 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 333 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 21 October 2024 PAGES : 8 PRICE : 5/-

# ఆలయాలు బాగుంటేనే మనం బాగుంటాం



- మన ఆలయాలకు గతంలో 15 లక్షల ఎకరాలు ఉండేది
- ఇసుగడ్డ మాదిరిగా కరుగుతూ 4.50 లక్షల ఎకరాలు మాత్రమే మిగిలాయి
- ఆలయాల సంరక్షణపై హైందవ సంఘాల డిక్లరేషన్
- విజయవాడలో హైందవ శంఖారావం సభ...
- డిక్లరేషన్ ప్రకటించిన వీహెచ్ పీ
- వీహెచ్ పీ ఆధ్వర్యంలో కేసరపల్లి వద్ద భారీ ఎత్తున హిందూ సభ
- లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలు
- హాజరైన చినజీయర్ స్వామి, గణపతి సచ్చిదానంద స్వామి తదితరులు















**విజయవాడ:** ఆలయాల ఆస్తులు, ఆచారాలు నాశనమైపోతున్నాయని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్నవరం, కేసరపల్లి లైలా గ్రీన్ మెడోస్ ప్రాంగణంలో ఇవాళ (ఆదివారం) హైందవ శంఖారావం సభ జరిగింది. ఈ సభలో వీహెచ్‌పీ జాతీయ ప్రతినిధులు, బీజేపీ నేతలు, మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామీజీలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి మాట్లాడారు. ఆలయాలు బాగుంటేనే మనం బాగుంటామని చెప్పారు. మన ఆలయాలకు గతంలో 15 లక్షల ఎకరాలు ఉండేదని చెప్పారు. ఐసుగడ్డ మాదిరిగా కరుగుతూ 4.50 లక్షల ఎకరాలు మాత్రమే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయాలకు కావాల్సిన నిర్ణయాలు ఎవరు చేయాలని ప్రశ్నించారు.

ఆఫీసుల్లో కూర్చునే అధికారులు చేయాలా అని నిలదీశారు. ఆలయాల్లో పూజ ఎంతసేపు చేయాలో ఆఫీసర్ చెప్పాలా...ధర్మాధికారి చెప్పాలా..?? అని ప్రశ్నించారు. ఆలయాలను కట్టుకునే మనం వాటిని నడపలేమా అని అడిగారు. 'మా ఆలయాలను మేమే నిర్వహించుకుంటాం... అధికారులు అవసరం లేదు" అని స్పష్టం చేశారు. ఆలయాల్లో కమిటీలన్నీ రాజకీయంతో నిండిపోతున్నాయిని ఆరోపించారు. ఆలయాల ఆస్తులు తిరిగి వాటికే వచ్చేలా చేయాలని కోరారు. ఆలయాల్లో జరిగే ఆరాధనలు.. సంప్రదాయాల్లో అధికారుల ప్రమేయం ఉండకూడదని షరతు విధించారు. దేవుడి వద్ద వీఐపీ దర్శనాలేంటి అని ప్రశ్నించారు. తిరుపతి వంటి ఆలయాల్లో డబ్బున్నవాళ్లకు వీఐపీ దర్శనాలు, డబ్బులేని వారికి రోజుల తరబడి నిరీక్షణలా అని ఆందోళన వ్యక్తం చేశారు. దేవుడి దర్శనానికి నిబంధనలు పెట్టబట్టే మతమార్పిడులు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. ఆలయాల్లో నిబంధనలు.. సాంప్రదాలను పాటించలేని వారు పక్కకు తొలగాలని హెచ్చరించారు. ఆక్రమణల్లో ఉన్న ఆలయాల ఆస్తులను స్వాధీనం చేయాలని కోరారు. అలా జరగనప్పుడు ఆలయాలు చేయిచాచి అడగనవసరం లేదని చెప్పారు. ఆలయాల్లో దర్శనం టిక్కెట్లతో అవసరం ఉండదన్నారు. మన ఆలయాలను మళ్లీ మన పవర్ ఫుల్ సెంటర్లుగా మార్చుకోవాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి పేర్కొన్నారు.

**దేవాదాయశాఖను రద్దుచేయాలి: కమలానంద భారతీ స్వామిజీ**

మనం నిర్మించుకున్న ఆలయాలపై ప్రభుత్వాల పెత్తనమేంటి అని శ్రీ భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతీ స్వామిజీ ప్రశ్నించారు. దేవాదాయశాఖను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సినిమాలకు మాదిరి కౌంటర్లు, టిక్కెట్లు పెట్టి ఆలయాల్లో దైవదర్శనాన్ని అమ్ముకుంటున్నారని ఆరోపించారు. దేవాదాయ , ధర్మాదాయ శాఖ దుర్మార్గమైనదని మండిపడ్డారు. మన రాష్ట్రంలోని దేవాలయాల బోర్డుల్లో హిందూ అనే పదాన్ని తీసేశారని ఆరోపించారు. హిందూ సమాజమంతా దేవాలయాలను ప్రశ్నించాలని అన్నారు. ప్రభుత్వమే దేవాలయాల భూములను కబ్జాచేసి ప్రభుత్వ కార్యాలయాలు,గోడౌన్లు నిర్మించిందని విమర్శించారు. దేవాలయంలో ఒక దేవుడుంటే 20 హుండీలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. హుండీలు పెట్టి భక్తులను దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో దేవాదాయ , ధర్మాదాయ చట్టాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలని అన్నారు. దశావతారాల్లో ఏడు అవతారాల ఆలయాలు ఉన్నది మన రాష్ట్రంలోనే అని గుర్తుచేశారు. ఏపీని రాష్ట్రప్రభుత్వం దేవభూమిగా ప్రకటించాలని కోరారు. ఏడు అవతారాల ఆలయాలను కలుపుతూ కారిడార్ ఏర్పాటు చేయాలని కమలానంద భారతి స్వామి డిమాండ్ చేశారు.

**డిక్లరేషన్‌లో కీలక అంశాలివే...**

విజయవాడ: హైందవ శంఖారావంలో విశ్వహిందూ పరిషత్ డిక్లరేషన్ ప్రకటించింది. హిందూ దేవాలయాలకు పూర్తి స్వయంప్రతిపత్తి కలిపిస్తూ చట్టసవరణ చేయాలని డిమాండ్ చేశారు. హిందు ఆలయాల ఆస్తులు, వ్యవస్థలపై దాడులు సరికాదని చెప్పారు. అన్యాయంగా, చట్టవిరుద్ధంగా దాడులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినాయకచవితి, దసరా వేడుకలకు ప్రభుత్వం నుంచి ఆర్థికభారం, అక్రమ ఆంక్షలు తగవు అని చెప్పారు. హిందూ దేవదేవతల శోభాయాత్రల మార్గాలు, తేదీలు, విధానాలపై అక్రమ ఆంక్షలు తగవని అన్నారు. ఆలయాల్లో పూజ, ప్రసాద, కైంకర్య సేవలు అత్యంత భక్తిశ్రద్ధలతో నాణ్యతతో నిర్వహించాలని తెలిపారు. హిందూ ఆలయాల్లో అన్యమత ఉద్యోగులను తక్షణం తొలగించాలని డిమాండ్ చేశారు. ట్రస్టు బోర్డులో హిందూ ధర్మంపై భక్తిశ్రద్ధలు ఉండే భక్తులను మాత్రమే సభ్యులుగా నియమించాలని కోరారు. రాజకీయేతర ధార్మిక వ్యక్తులను ట్రస్టుబోర్డుల్లో చోటు కల్పించాలన్నారు. హిందూ దేవాలయాల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుప్రకారం అన్యాక్రాంతమైన ఆస్తులను స్వాధీనం చేసుకుని ఆలయాలకు తిరిగి అప్పగించాలని కోరారు. ఆలయాల నిధులను ప్రభుత్వ కార్యక్రమాలకు దారి మళ్లించరాదని చెప్పారు. హైందవశంఖారావంలో డిక్లరేషన్‌పై చినజీయర్ స్వామిజీ ప్రతిజ్ఞ చేయించారు.

**ఈ డిక్లరేషన్ లోని అంశాలు...**

ఆలయాలకు పూర్తి స్వయంప్రతిపత్తి ఇస్తూ చట్ట సవరణ చేయాలి

హిందూ దేవాలయాల ఆస్తులు, వ్యవస్థలపై దాడులు అరికట్టాలి

చట్టవిరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

వినాయకచవితి, దసరా వంటి ముఖ్య పండుగల సమయంలో ఆంక్షలు విధించడం తగదు

దేవాలయాల్లో పూజలు, ప్రసాదాలు, కైంకర్యాలు భక్తిశ్రద్ధలతో చేయాలి

హిందూ దేవాలయాల్లో పనిచేస్తున్న అన్యమత ఉద్యోగులను వెంటనే తొలగించాలి

హిందూ ధర్మం పాటించే వారినే ట్రస్టు బోర్డుల్లో సభ్యులుగా నియమించాలి

ట్రస్టు బోర్డుల్లో రాజకీయేతర ధార్మిక వ్యక్తులకు స్థానం కల్పించాలి

హిందూ దేవాలయాలకు సంబంధించిన ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

ఇప్పటికే అన్యాక్రాంతమైన ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకుని ఆయా ఆలయాలకు అప్పగించాలి

దేవాలయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ధార్మిక కార్యక్రమాలకే వినియోగించాలి

# బాబోయ్ చలి


- రికార్డు స్థాయిలో పడిపోయిన ఉష్ణోగ్రతలు..
- మరో 3 రోజులు బీభత్సమే
- నాలుగైదు రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో వినిపిస్తున్న మాట.
- చలిభయంతో బయటకు వెళ్లాలంటేనే వణికిపోతున్న పరిస్థితి
- అదే సమయంలో ఆరోగ్య శాఖ నుంచి కూడా హెచ్చరికలు
- అప్రమత్తంగా లేకపోతే ప్రమాదమే అంటున్న వైద్యులు



# ఇకపై లవర్స్‌కు నో రూమ్స్!

ఓయో సంచలన నిర్ణయం..

రూమ్ బుక్ చేసుకునే సమయంలో తమ రిలేషన్‌షిప్‌ను నిర్ధారించే ఐడీ ప్రూఫ్‌ను సమర్పించాలి



## ఒక్క చాన్స్ ప్లీజ్...

# నామినేటెడ్ ఎమ్మెల్సీల కోసం జోరుగా ప్రయత్నాలు



**బెంగళూరు:** విధానపరిషత్‌కు నామినేటెడ్ విధానంతో నలుగురిని ఎంపిక చేసేందుకు వీలున్నందున ఆశావాహులు తీవ్రస్థాయిలో లాబీ చేస్తున్నారు. సభ్యులు యూబీ వెంకటేష్, ప్రకాష్ రాథోడ్‌ల పదవీకాలం ముగిసింది. చెన్నపట్టణ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందిన సీపీ యోగేశ్వర్ బీజేపీ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. కాగా ఈనెల 27న జేడీఎస్ సభ్యుడు తిప్పేస్వామి పరిషత్ పదవీకాలం ముగియనుంది. ఇలా నాలుగు స్థానాలకు ఖాళీ ఏర్పడగా, కాంగ్రెస్ నుంచి ఎంపిక చేసే వెసలుబాటు ఉంది. అయితే ఆ స్థానాలకు ఏకంగా 20 మంది దాకా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. యూబీ వెంకటేష్, ప్రకాష్ రాథోడ్ మరోసారి అవకాశం కోసం ప్రయత్నిస్తున్నారు. మాజీ సభాపతి బీఎల్ శంకర్, మాజీ మంత్రి రాణి సతీషలు ఇప్పటికే సీఎంను కలిసి అవకాశం కోరినట్లు తెలుస్తోంది. నలుగురిని భర్తీ చేయాల్సి ఉన్నందున డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయంతో పాటు ఎఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేను సంప్రదించాల్సి ఉంటుంది. ఇప్పటికే పలువురు ఇటు సీఎం, డీసీఎంలతోనే కాకుండా ఢిల్లీలో ఖర్గేతో పాటు ఇతర నేతల ద్వారా కూడా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నెలాఖరులోగానే నలుగురిని ఎంపిక చేయడం ద్వారా పరిషత్‌లో ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశాల నాటికి బలం పెంచుకోదలచారు. నలుగురిని ఎంపిక చేయాలంటే సీఎం, డీసీఎంలు ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత అధిష్టానం ఆమోదం కూడా లభించాల్సి ఉంటుంది.

## భారీ బోర్డింగ్ పాస్ చూపించిన వ్యక్తి.. ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ సిబ్బంది ఏం చేశాడంటే?



**న్యూఢిల్లీ:** ఒక విమాన ప్రయాణికుడు విభిన్నంగా వ్యవహరించాడు. బోర్డింగ్ పాస్‌ను పెద్ద పేపర్‌పై ప్రింట్ తీశాడు. ఎయిర్‌పోర్ట్‌లోని సెక్యూరిటీ సిబ్బందికి దీనిని చూపించాడు. ఇది చూసి అతడు షాక్ అయ్యాడు. అందులోని వివరాలు పరిశీలించేందుకు కాస్త ఇబ్బంది పడ్డాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. విమానంలో ప్రయాణించేందుకు ఒక వ్యక్తి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నాడు. గేట్ వద్ద ఉన్న సెక్యూరిటీ సిబ్బందికి భారీ సైజులో ప్రింట్ చేసిన బోర్డింగ్ పాస్‌ను రెండు చేతుల్లో పట్టుకుని చూపించాడు. ఇది చూసి ఆ సెక్యూరిటీ అధికారి అయోమయం చెందారు. పెద్ద పేపర్‌పై ప్రింట్ చేసిన టిక్కెట్ వివరాలను సరిచూసుకునేందుకు కాస్త ఇబ్బందిపడ్డారు. బోర్డింగ్ పాస్‌ను ఇలా ప్రింట్ చేయాలని నీ స్నేహితులకు చెప్పవద్దని నవ్వుతూ అన్నారు. కాగా, ఈ వీడియో క్లిప్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. 'వారు ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేస్తున్నారేమో' అని క్యాప్షన్ ఇచ్చారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నెటిజన్లు కూడా ఫన్నీగా స్పందించారు. ప్రాంక్ చేసేందుకు లేదా సోషల్ మీడియాలో ప్రమోట్ అయ్యేందుకు ఆ వ్యక్తి ఇలా చేసి ఉంటాడని కొందరు పేర్కొన్నారు. మరోవైపు ట్రావెల్ కంపెనీ మేక్‌మైట్రిప్ కూడా ఈ వీడియో క్లిప్‌పై స్పందించింది. పేపర్‌ను సేవ్ చేయాలని సూచించింది. తమ ద్వారా కొనుగోలు చేసిన విమాన టిక్కెట్లను వాట్సాప్‌లో కూడా చూపించవచ్చని పేర్కొంది. మీ ప్రయాణం కంటే మీ జీవితం, అభిరుచి పెద్దవని ప్రశంసించింది.

## ఇకపై లవర్స్‌కు నో రూమ్స్!

పెళ్లికి ముందే ప్రైవసీ కోసం ఎక్కువమంది ఎంచుకునే ఆప్షన్ ఓయో రూమ్స్. వివాహంతో సంబంధం లేకుండా పరస్పర అంగీకారంతో శారీరక సంబంధం కలిగిన వ్యక్తులు ఓయో రూమ్స్‌కు వెళ్తుంటారు. స్త్రీ, పురుషుల గుర్తింపు కార్డు చూపించి, టారిఫ్ చెల్లిస్తే ఎటువంటి అభ్యంతరం చెప్పకుండా రూమ్స్ కేటాయిస్తారు. ఎక్కువమంది కాలేజీ అబ్బాయిలు, అమ్మాయిలు ఓయో సర్వీసెస్ ఉపయోగించుకుం టున్నారు. కొందరు ఓయో సర్వీసెస్‌ను తప్పుపడుతున్నారు. తమ పిల్లలు చెడిపోవడానికి ఇవి కారణమవుతున్నాయని విమర్శించేవాళ్లు ఉన్నారు. గత కొన్నేళ్లుగా ఓయో హాస్పిటాలిటి సేవలను అందిస్తోంది. తక్కువ ధరకే రూమ్స్ అందించడంతో ఓయో సర్వీసెస్ తక్కువకాలంలో అందరినీ ఆకర్షించాయి. అదే సమయంలో కపుల్స్ కాకపోయినా పరస్పర అంగీకారంతో అమ్మాయి, అబ్బాయి ఒకే రూమ్‌లో ఉండేందుకుఓయో హొటల్స్ అనుమతిస్తుండటంతో వీటికి డిమాండ్ పెరిగింది. ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్న ఘటనల దృష్ట్యా ఓయో హొటల్స్ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది.

**వారికి నో ఎంట్రీ..**

ఓయో హొటల్స్‌లో రూమ్ బుక్ చేసుకోవడం ఎంతో ఈజీ. ఓయో యాప్‌లో రూమ్ బుక్ చేసుకుని, నేరుగా హొటల్‌కు వెళ్తే గది కేటాయిస్తారు. రూమ్‌లో ఉండే వ్యక్తుల గుర్తింపు కార్డు జిరాక్స్ హొటల్ రిసెప్షన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. అంతేతప్ప మిగిలిన ఏ వివరాలు అడగరు. ముఖ్యంగా ప్రైవసీ కోరుకునేవారికి ఓయో రూమ్స్ అనువైన ప్రదేశంగా చెబుతారు. ఇప్పటివరకు ఎవరైనాఓయోలో రూమ్ బుక్ చేసుకునే వెసులుబాటు ఉండగా.. తాజాగా ఓయో పెళ్లి కాని జంటలకు రూమ్స్ ఇవ్వబోమనే కొత్త రూల్ తీసుకొచ్చింది. ఓయో తీసుకొచ్చిన నూతన చెక్ ఇన్ పాలసీలో పెళ్లి కాని జంటలు రూమ్‌ను బుక్ చేసుకునే అవకాశం ఉండదు. ఈ నిబంధనలను తొలుత ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో అమలు చేస్తోంది. ఆ తర్వాత ఈ విధానాన్ని దేశమంతా విస్తరించే ఛాన్స్ ఉంది. ఇకనుంచి రూమ్ బుకింగ్ సమయంలో జంటలు తమ పెళ్లిని నిర్ధారించే గుర్తింపు కార్డును సమర్పించాలి. సురక్షితమైన, బాధ్యతాయుతమైన హాస్పిటాలిటీకి తాము కట్టుబడి ఉన్నామని ఓయో నార్త్ ఇండియా హెడ్ పవాస్ శర్మ తెలిపారు.

**గుర్తింపు చూపిస్తే..**

ఎవరైనా జంటలు ఓయోలో రూమ్స్ బుక్ చేసుకోవాలంటే వివాహ ధృవీకరణ లేదా, కపుల్స్‌గా ధృవీకరించే ఏదైనా పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. గతంలో వలె రూమ్స్ బుక్ చేసుకునే విధానంలో స్వల్ప మార్పులు చేసినట్లు తెలుస్తోంది. ఓయో నిర్ణయాన్ని కొందరు స్వాగతిస్తుండగా.. ప్రేమికులకు మాత్రం ఇది షాకింగ్ అనే చెప్పుకోవాలి. జంటగా ధృవీకరించే పత్రాలు బుకింగ్ సమయంలో సమర్పించకపోతే వారికి రూమ్ బుక్ కాదనే చెప్పుకోవాలి.

## పూరీలోని జగన్నాథ ఆలయంపై ఎగిరిన డ్రోన్..


# కలకలం రేపిన ఘటన



**భువనేశ్వర్:** ఒడిశాలోని పూరీలో ఉన్న ప్రసిద్ధ జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగిరింది. సుమారు అరగంట పాటు అక్కడ తిరిగింది. దీంతో ఈ సంఘటన కలకలం రేపింది. ఈ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం ఉదయం తెల్లవారుజామున 4.10 గంటల సమయంలో పూరీలోని జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగిరింది. దానికి అమర్చిన కెమెరాలో ఆలయాన్ని చిత్రీకరించింది. కాగా, నో ఫ్లైయింగ్ జోన్ ప్రాంతమైన జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగురడం కలకలం రేపింది. భద్రతా లోపాలపై ఆందోళనకు దారి తీసింది. న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ఈ సంఘటనపై స్పందించారు. జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగురవేయడం చట్టవిరుద్ధమని, ఆమోదయోగ్యం కాదని అన్నారు. భద్రతా ఉల్లంఘనకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరుగకుండా ఆలయం చుట్టూ ఉన్న నాలుగు వాచ్‌టవర్ల వద్ద 24 గంటలపాటు పోలీస్ సిబ్బందిని మోహరించే చర్యలు చేపడతామని అన్నారు. మరోవైపు పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. దర్యాప్తు కోసం పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పూరీ ఎస్పీ వెల్లడించారు. ఎవరో యూట్యూబర్ ఈ చర్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

## ఒకసారి జనాభా తగ్గుదల మొదలైతే దాన్ని అడ్డుకోవడం కష్టం..

# జోహో సీఈఓ హెచ్చరిక



**ఇంటర్నెట్ డెస్క్:** జనాభా తగ్గుదల ఒక్కసారి మొదలైతే పరిస్థితిని చక్కదిద్దడం చాలా కష్టమని జోహో కార్పొరేషన్ సంస్థ సీఈఓ శ్రీధర్ వెంబు తాజాగా హెచ్చరించారు. చైనా, జపాన్‌లోని పరిస్థితులను ఇందుకు తాజా ఉదాహరణగా పేర్కొన్నారు. "1990ల్లో జపాన్ సాంకేతికంగా ఉచ్ఛస్థితికి చేరుకుంది. అమెరికాను కూడా చైనా మించిపోనుందని అప్పట్లో జనాలు చెప్పుకునేవారు. కానీ ఇప్పుడేమైందీ.. అక్కడి జనాభా తగ్గిపోవడంతో కొత్త సమస్యలు ప్రారంభమవుతున్నాయి" అని ఆయన తాజాగా ట్వీట్ చేశారు. ప్రస్తుతం చైనాలో కూడా దాదాపు ఇదే పరిస్థితి పునరావృతమవుతోం దని అన్నారు దేశాల్లో పారిశ్రామీకరణ, నగరీకరణ జరుగుతున్న తీసుకునే నిర్ణయాలు, సంస్కృతి సంప్రదాయాలు కనుమరుగవుతుండటం, చిన్న కుటుంబాల సంఖ్య పెరగడం తదితరాలు జనాభా తగ్గుదలకు దారి తీస్తాయని శ్రీధర్ వెంబు చెప్పారు. "ఒక్కసారి జనాభా తగ్గుదల మొదలైతే దాన్ని అడ్డుకోవడం చాలా కష్టం. నాకు తెలిసి ఈ పరిస్థితి అడ్డుకున్న దేశం ఒక్కటి కూడా లేదు. అందుకే నేను గ్రామీణ జీవనానికి, మన సంప్రదాయాలవైపు మొగ్గు చూపుతాను" అని ఆయన అన్నారు. జంటలను పిల్లల్ని కనేలా ప్రోత్సహించే అభివృద్ధి విధానాలకే తన మద్దతు అని స్పష్టం చేశారు. మిగతావేటికీ ఇంత ప్రాముఖ్యత లేదని స్పష్టం చేశారు. భారత జనాభాలో మార్పులపై ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో జోహో సీఈఓ వ్యాఖ్యలు మరోసారి నెట్టింట ట్రెండింగ్‌లోకి వచ్చాయి. జనాభా స్థిరీకరణకు సంతానోత్పత్తి రేటు 2.1 కాగా దక్షిణాది రాష్ట్రాల్లో ఇప్పటికే ఈ రేటు 1.6కి చేరుకుంది. దీంతో, జనాభాలో వృద్ధుల సంఖ్య పెరిగి దేశంపై భారం పెరిగే అవకాశం ఉందన్న ఆందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. గతేడాది నవంబర్‌లో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జనాభా తగ్గుదలతో ప్రమాదాలపై కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. జనాభాలో ప్రతికూల మార్పులను అడ్డుకునేందుకు తక్షణ చర్యలు అవసరమని ఆయన పిలుపునిచ్చారు.

## జేడీఎస్ నిర్వీర్యానికే.. ఆపరేషన్ హస్త కుట్ర

ప్రలోభ పెట్టినట్లు ఎమ్మెల్యేలు స్వయంగా చెప్పారు..

12 మందిని పార్టీ మార్చే ప్రయత్నాలు జరిగాయి

కేంద్రమంత్రి కుమారస్వామి సంచలన ఆరోపణ



**బెంగళూరు:** జేడీఎస్ పార్టీని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకే ఆపరేషన్ హస్త కుట్ర పన్నారని కేంద్రమంత్రి కుమారస్వామి సంచలనమైన ఆరోపణలు చేశారు. బెంగళూరులో కుమారస్వామి మీడియాతో మాట్లాడుతూ జేడీఎస్ పార్టీకి చెందిన 12–13 మంది ఎమ్మెల్యేలను పార్టీ మార్పించే ప్రయత్నాలు జరిగాయన్నారు. అయితే జేడీఎస్ ఎమ్మెల్యేలను మార్పు చేయడం అంత సులువు కాదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాపాలు పెరిగాయన్నారు. తమ ఎమ్మెల్యేలు తనకు పూర్తి సమాచారం అందించారన్నారు. సంక్రాంతి ముగిసే దాకా ఏమీ మాట్లాడేది లేదన్నారు. జేడీఎస్ ఇటువంటి కుట్రలకు భయపడేది లేదని, జేడీఎసను ఎప్పటికీ నిర్వీర్యం చేయలేరన్నారు. దేవుడే కాంగ్రెస్‌కు తగిన శిక్ష వేస్తారన్నారు. దేశంలో గ్యారెంటీలకు పోటీ పడుతున్నారన్నారు. తొలుత అమలు చేసిన హిమాచల్ ప్రదేశ్ పరిస్థితి ఏం జరిగిందో తెలిసిందేనన్నారు. రాష్ట్రంలో ఎటువంటి పరిస్థితి ఉందో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గ్రాంట్ల కోసం ఎన్ని తంటాలు పడుతున్నారో అందరికీ తెలుసన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఆత్మాభిమానం ఉంటే ప్రభుత్వం ఏదిశగా వెళుతుందో దృష్టి సారించాలన్నారు. మైసూరులో ప్రిన్సెస్(మహారాణి) పేరుతో ఉండే రోడ్డుకు సిద్దరామయ్య పేరు పెట్టాలనే ప్రస్తావనపై ఆయన ఎద్దేవా చేశారు. కర్ణాటకకే సిద్దరామయ్య పేరు పెడితే బాగుంటుందన్నారు. మరో ప్రశ్నకు సమాధానంగా తమ పార్టీ సీనియర్ నేత జీటీ దేవెగౌడతో తనతో భార్యాభర్తల సంబంధమన్నారు. ఎన్నోసార్లు గొడవలు జరుగుతాయని ఆతర్వాత సమిసిపోతాయన్నారు.

## బీజేపీకి ఒక్క ఛాన్స్ ఇవ్వండి



**న్యూఢిల్లీ:** ఉజ్వల భవిష్యత్తు కోసం బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని ఢిల్లీ ప్రజలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరారు. దేశ రాజధానిని అభివృద్ధి చేయగలిగే పార్టీ ఒక్క బీజేపీయేనని అన్నారు. రోహిణిలో ఆదివారంనాడు జరిగిన 'బీజేపీ పరివర్తన యాత్ర'లో ఆయన మాట్లాడుతూ, మనం 2025 సంవత్సరంలో ఉన్నామని, 21వ శతాబ్దంలో 25 ఏళ్లు గడిచిపోయాయని, శతాబ్దంలో పావు సంవత్సరం ముసిగిపోయిందని అన్నారు. ఈ 25 ఏళ్లలో రెండు, మూడు తరాల యువతరం ఢిల్లీలో ఎదిగిందని, రాబోయే 25 ఏళ్లు భారతదేశ భవిష్యత్తుకు, ఢిల్లీ భవిష్యత్తుకు చాలా కీలకమని చెప్పారు. ఈ పాతికేళ్లలో దేశం 'వికసిత్ భారత్'గా రూపొందనుందని అన్నారు. "ఢిల్లీలో ఈరోజు వేల కోట్లు విలువచేసే అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన జరిగింది. రాబోయే 25 ఏళ్లు, దేశానికి, ఢిల్లీకి చాలా కీలకం. వికసత్ భారత్ లక్ష్యంగా ముందుకు వెళ్దాం" అని ప్రధాని చెప్పారు. ఢిల్లీ ఉజ్వల భవిష్యత్తు కోసం బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని, ఢిల్లీని బీజేపీ అభివృద్ధి పథకంలోకి తీసుకువెళ్తుందని భరోసా ఇచ్చారు. గత పదేళ్లలో 'విపత్తు'నే చూశామని, అభివృద్ధినే ఢిల్లీ ప్రజలు కోరుకుంటున్నారని, ప్రజల కోసం బీజేపీ పనిచేస్తుందని నమ్మకం ప్రజలకు ఉందని అన్నారు. ప్రజావిశ్వాసం చూరగొనడం వల్లే హర్యానా, ఒడిశా, మహారాష్ట్ర వంటి పలు ఎన్నికల్లో పార్టీ గెలుపొందిందని, ఈసారి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలుస్తుందనే గట్టి నమ్మకం ఉందన్నారు.

**ప్రపంచంలోనే బెస్ట్ సిటీగా..**

ఢిల్లీకి ప్రపంచంలోనే ఉత్తమ నగర హోదాను తీసుకురాగలిగే సత్తా బీజేపీకి మాత్రమే ఉందని మోదీ అన్నారు. 'ఆప్‌దా'ను ఢిల్లీ నుంచి తొలగించి ఢిల్లీ ప్రజల హృదయాలను గెలుచుకునేందుకు ఇదే తగిన సమయమని పేర్కొన్నారు.

# ప్రియాంక గాంధీ చెంపల మాదిరిగా రోడ్లను నున్నగా చేస్తా..

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో తర్వలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న బీజేపీ అభ్యర్థి రమేష్ బిధురి వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. రానున్న ఎన్నికల్లో తాను గెలిస్తే కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా చెంపల మాదిరిగా తన అసెంబ్లీ నియోజకవర్గంలోని రోడ్లను నున్నగా చేస్తానని అన్నారు. ఈ నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. ఢిల్లీ సీఎం అతిషిపై కల్కాజీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న రమేష్ బిధురి ఆదివారం ఒక కార్యక్రమంలో మాట్లాడారు. 'బీహార్ రోడ్లను హేమమాలిని చెంపల వలె నున్నగా చేస్తానని లాలూ యాదవ్ ఒకసారి ప్రస్తావించారు. కానీ ఆ వాగ్దానాన్ని నెరవేర్చడంలో ఆయన విఫలమయ్యారు. అయితే ఓఖ్లా, సంగమ్ విహార్‌లోని రోడ్లను మేం అభివృద్ధి చేశాం. అదే మాదిరిగా కల్కాజీలోని ప్రతి రహదారి ప్రియాంక గాంధీ చెంపల మాదిరిగా నున్నగా ఉండేలా చూస్తాం' అని అన్నారు. కాగా, బీజేపీ అభ్యర్థి రమేష్ బిధురి వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. ఆ పార్టీ నాయకురాలు సుప్రియా శ్రీనాట్ ఘాటుగా విమర్శించారు. ఆయన వ్యాఖ్యలు సిగ్గుచేటని అన్నారు. బీజేపీ మహిళా వ్యతిరేక ఆలోచనకు ఇది నిదర్శమని ఆరోపించారు. 'ప్రియాంక గాంధీ గురించి రమేష్ బిధూరి చేసిన ప్రకటన సిగ్గుచేటు మాత్రమే కాదు, మహిళల పట్ల ఆయన అసహ్యకరమైన మనస్తత్వాన్ని కూడా చూపుతున్నది. తోటి



ఎంపీపై పరుష పదజాలం వాడి ఎలాంటి శిక్ష అనుభవించని వ్యక్తి నుంచి ఇంకేం ఆశించాలి? బీజేపీ అసలు ముఖం ఇదే' అని ఎక్స్‌లో విమర్శించారు.

# సిసి రోడ్ల పనులను
# త్వరితగతిన పూర్తి చేయాలి- కెకె మహేందర్ రెడ్డి





**షణ్ముఖ వెలుగు ఎల్లారెడ్డి పేట ప్రతినిధి జనవరి 05:** సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల అభివృద్ధి పనులకు ఎన్ఆర్ జెసి కింద 20 కోట్లు మంజూరు అయ్యాయని సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్ల గొల్లపల్లిలో 50 లక్షల రూపాయలతో నిర్మించనున్న సిసి రోడ్లకు ఇన్చార్జి కే కే మహేందర్ రెడ్డి ఎఏంసి చైర్మన్ షేక్ సాబేరా బేగం స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట మండలానికి నాలుగు కోట్ల 80 లక్షల రూపాయలు సీసీ రోడ్లకు మంజూరు చేయడం జరిగిందన్నారు. అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లను కాంగ్రెస్ పార్టీ నాయకులను,ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎన్ ఆర్ ఈజి ఎస్ పథకం ద్వారా మంజూరు అయిన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులనుఆర్థిక సంవత్సరంలోనే పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలోని అధికార యంత్రాంగం కూడా ఎంతో ఉత్సాహంతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తున్నారని, గత ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారులకు స్వేచ్ఛా యుతవాతావరణం ఏర్పడిందన్నారు. ప్రజా పాలనలో భరోసా కల్పిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో చేసిన అప్పులకు రాష్ట్రంలో 6,600 పైచిలుకు కోట్ల రూపాయల నెలకు వడ్డీ చెల్లిస్తూ నే వుందన్నారు. చేసిన అభివృద్ధి పనులకు 40 కోట్ల పైచిలుకు రూపాయలు పెండింగ్ లో పెట్టారని అన్నారు. ఒకవైపు అప్పులు కట్టుకుంటూనే సంవత్సరానికి 70 నుంచి 72 వేల కోట్ల రూపాయల వడ్డీలు కడుతూ ప్రతి నెల ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు చెల్లిస్తుందని, మిగతా నిధులతో మరోవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకుపోతున్నామన్నారు. రాష్ట్రంలోని ప్రజలు మా మీద ఏదైతే నమ్మకం పెట్టుకున్నారో ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇచ్చిన హామీలు 6 గ్యారెంటీ లను ఒక్కొక్కటిగా అమలు చేసి తీరుతామని అన్నారు. జనవరి 26 నుండి రైతులకు రైతు భరోసా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ రాష్ట్రంలో ఉన్న ఆర్థిక వనరుల ను దృష్టిలో పెట్టుకొని నిజంగా వ్యవసాయం చేస్తున్నారో వారికే రైతు భరోసా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఏంసి చైర్మన్ షేక్ సాబేర బేగం, సివిల్ ఇంజనీర్ శ్రీనివాస్ లతో పాటు ఎఏంసి వైస్ ప్రెసిడెంట్ గుండాడి రామిరెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ గౌస్ పందిళ్ళ లింగం గౌడ్ వంగ మల్లారెడ్డి, డైరెక్టర్లు మెండే శ్రీనివాస్ యాదవ్ పొన్నాల తిరుపతి రెడ్డి గంట చిన్న లక్ష్మి బుచ్చా గౌడ్ పట్టణ అధ్యక్షులు చెన్ని బాబు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుర్రపు రాములు బండారి బాల్ రెడ్డి గొల్లపల్లి మల్లేశం మహబూబ్ పుల్లయ్య గారి తిరుపతి గౌడ్ ఈసరి శంకర్ పందిల్ల శ్రీనివాస్ గౌడ్ గడ్డం జితేందర్ అంతెర్పుల గోపాల్ వెంకటేష్ గౌడు ఉప్పుల రవి చెరుకు ఎల్లయ్య యాదవ్ శంకర్ మాజీ వార్డు మెంబర్ శనిగరపు బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట లో ఘోర రోడ్డు ప్రమాదం




**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ రూరల్ ప్రతినిధి జనవరి 05:** జమ్మికుంట పట్టణ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మరొకరికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం ఇద్దరు వ్యక్తులను వరంగల్ ఎంజీఎం కు తరలించారు. జమ్మికుంట మండలం పెద్దంపల్లి గ్రామానికి చెందిన దొడ్డె రాజయ్య అనే వ్యక్తితో పాటు పట్టణ పరిధిలోని దుర్గ కాలనీకి చెందిన సంపత్ అనే ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనం( మోపెడ్ ఎక్సెల్) పై వెళ్తుండగా ద్విచక్ర వాహనం యూటర్న్ తీసుకునే క్రమంలో కారు బలంగా ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. రాజయ్య కాలు విరగగా సంపత్ తలకు బలమైన గాయాలు అయ్యాయి. బాధితుల బంధువులు 108 కు సమాచారం ఇవ్వడంతో, వెంటనే 108 ద్వారా హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎం తరలించారు. కాగా ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన కారు జమ్మికుంట పట్టడానికి చెందిన ఓ వైద్యురాలు కారుగా ప్రచారం జరుగుతోంది

## అడవి పదిర గ్రామంలో
## ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ

పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కేకే మహేందర్ రెడ్డి విమలక్క





**షణ్ముఖ వెలుగు ఎల్లారెడ్డి పేట ప్రతినిధి జనవరి 05:** వీర్నపల్లి మండలంలోని అడవిపదిర గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్చార్జి కే కే మహేందర్ రెడ్డి,అరుణోదయ సాంస్కృతిక సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు ఉద్యమ కారిని గాయని విమలక్క లు ఘనంగా ప్రారంభించారు.
ఈ కార్యక్రమంలో కొండూరు రవీందర్ రావు,తోట ఆగయ్య తో పాటు పలువురు బిజెపి బిఆర్ఎస్ కాంగ్రెస్, ఎంఆర్పియస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్
# మండలం అధ్యక్షుడుగా కొల్లూరి కిరణ్ ఎన్నిక




**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ రూరల్ ప్రతినిధి జనవరి 05:** ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న హుజురాబాద్ నియోజకవర్గంలోని హుజురాబాద్ మండలం అధ్యక్షుడుగా నియామకం ఆదివారం రోజున జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ,వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్ రెడ్డి, హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు నూతనంగా నియమించబడ్డ హుజురాబాద్ మండల అధ్యక్షుడు కొల్లూరి కిరణ్ కుమార్ కు నియామక పత్రాన్ని కాంగ్రెస్ పార్టి హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి వొడితెల ప్రణవ్ అందజేశారు.హుజురాబాద్ మండల అధ్యక్షుడు కిరణ్ మాట్లాడుతూ పార్టీని నమ్ముకొని,పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటుంది అని, రాబోయే రోజుల్లో పార్టీ కోసం పనిచేసిన ప్రతీ ఒక్కరికీ తగిన గుర్తింపు ఇస్తుందని, కార్యకర్తలను కాపాడు కుంటుందని,ఎవరు అధైర్యపడొద్దని అందరికీ అవకాశాలు ఇస్తుందని భరోసా ఇచ్చారు. గ్రామ స్థాయిలో పార్టీని బలపరచి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో హుజురాబాద్ నుండి మెజారిటీ స్థాయిలో సీట్లు పొంది ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మెంబర్ పత్తి కృష్ణారెడ్డి, హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్వరి-స్వామిరెడ్డి,హనుమాన్ దేవాలయ చైర్మెన్ కొలిపాక శంకర్,జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య, హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మిడిదొడ్డి రాజు, సాహెబ్ హుస్సేన్,సొల్లు బాబు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే
## విద్యార్థులు పోటీతత్వం అలవరచుకోవాలి

-ట్రస్ట్ సెక్రటరీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్




**షణ్ముఖ వెలుగు శేరిలింగంపల్లి ప్రతినిధి జనవరి 04:** విద్యార్థులు పోటీ తత్వం పెంపొందించుకొని క్రమశిక్షణ పట్టుదలతో మా ట్రస్టు అందిస్తున్న స్టడీ మెటీరియల్ ను సద్వినియోగం చేసుకుని పదవ తరగతిలో మంచి మార్కులు సాధించాలని గొప్ప గొప్ప చదువులు చదివి భవిష్యత్తులో మీరు ఉన్నత స్థాయికి వెళ్లి సమాజానికి సేవ చేయాలంటూ కొండాపూర్ డివిజన్ గచ్చిబౌలి ప్రభుత్వ పాఠశాలలో 10 వ తరగతి చదివే విద్యార్థిని, విద్యార్థులు ఉద్దేశించి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ మాట్లాడారు. శనివారం గచ్చిబౌలి ప్రభుత్వ పాఠశాల కొత్తగూడ ప్రభుత్వ పాఠశాలలో సందయ్య మెమోరియల్ ట్రస్టు మరియు ఆర్కే వై ఫౌండేషన్ సౌజన్యంతో దాదాపు 300ల మంది విద్యార్థులకు పైగా జరగబోయే పరీక్షలను దృష్టిలో పెట్టుకొని ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేసినట్లు ట్రస్టు సెక్రెటరీ రవి కుమార్ యాదవ్ తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, డివిజన్ అధ్యక్షులు ఆంజనేయులు సాగర్ ప్రసాద్ రెడ్డి, మన్యంకొండ పద్మ మల్లేష్ వెంకటేష్ రేఖ సరోజ రెడ్డి మొదలగురు పాల్గొన్నారు.

## కాప్రా వీర శైవుల కొత్త క్యాలెండర్
## ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారి



**షణ్ముఖ వెలుగు కాప్రా సర్కిల్ ప్రతినిధి జనవరి 05:** ఉప్పల్ నియోజకవర్గ కాప్రా వీరశైవుల 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్ ఆవిష్కరించిన ఉప్పల్ ఎమ్మెల్యే శ్రీ బండారి లక్ష్మారెడ్డి కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డిలు అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ వీరశైవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తానని హామీ ఇచ్చారు, వెల్ఫేర్ అసోసియేషన్ కు ఎల్లవేళలా తోడ్పాటు గా ఉంటానని హామీ ఇచ్చారు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే తో పాటు పలువురు ప్రముఖులను శాలువాలతో సత్కరించారు . ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, సింగిరెడ్డి ధన్ పాల్ రెడ్డి, కాసం మహిపాల్ రెడ్డి, బన్నాల ప్రవీణ్, విజయ హైస్కూల్ కరస్పాండెంట్స్ కొప్పునూరు రాజేష్, కొప్పునూరు ప్రవీణ్, వీరశైవ పెద్దలు యావపురం విశ్వనాథం గంగా ఈశ్వరయ్య, శశి కుమార్ సమాజ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, ఉల్లెం బాలరాజ్, యావాపురం రవి, బండే గౌడ, శివానంద్, భీమశంకర్, గిరిజాపతి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని
# పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**షణ్ముఖ వెలుగు శ్రీరంగాపురం ప్రతినిధి జనవరి 05:** శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన ముంత లక్ష్మి ప్రమాదవశాత్తు మరణించిన విషయం తెలుసుకున్న వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ యాదవ్ ముంత లక్ష్మి మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో శ్రీరంగపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాములు యాదవ్, టౌన్ ఎస్సీ సెల్ కార్యకర్త శ్రీనివాసులు,మాజీ ఉప సర్పంచ్ మహేష్ గౌడ్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత





**షణ్ముఖ వెలుగు అడ్డ గూడూరు ప్రతినిధి జనవరి 05:**ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ను అడ్డ గూడూరు ఎస్సై డి నాగరాజు పట్టుకున్నారు. అడ్డ గూడూరు మండల పరిధిలో రేపాక (డి) గ్రామానికి చెందిన రవి రాజు అనే వ్యక్తి అడ్డ గూడూరు మండల పరిధిలో ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా తన ట్రాక్టర్ టిఎస్ %యీ% 30 ఇ 4069 సోనాలిక తో మూసి వాగు నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు అడ్డ గూడూరు సమీపంలో ట్రాక్టర్ పట్టుకుని ఇసుక సరఫరా చేస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్ ను సీజ్ చేశామని ఎస్సై డి నాగరాజు తెలిపారు

## కేటీఆర్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన గోపరాజు శ్రీనివాస్ రావు



**షణ్ముఖ వెలుగు శేరిలింగంపల్లి ప్రతినిధి జనవరి 04:** ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శనివారం రోజు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ను మర్యాద పూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ నాయకులు గోపరాజు శ్రీనివాస్ రావు ఆయనను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## రెడ్డి సంఘం అభివృద్ధికి కృషి చేస్తా-ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**షణ్ముఖ వెలుగు కాప్రా సర్కిల్ ప్రతినిధి జనవరి 05:**మల్లాపూర్ లో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రెడ్డి సంఘం అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఆయన అన్నారు తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, బండారి నీలం రెడ్డి, మల్లాపూర్ రెడ్డి సంఘం అధ్యక్షుడు కాసం రాజిరెడ్డి, మహిపాల్ రెడ్డి రెడ్డి, దోమ శ్రీనివాస్ రెడ్డి రెడ్డి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబాను దర్శించుకుని కాలని సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి





**షణ్ముఖ వెలుగు కాప్రా సర్కిల్ ప్రతినిధి జనవరి 05:** ఉప్పల్ నియోజకవర్గం మీర్ పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ పరిధిలోని మంగాపురం కాలనీ సాయిబాబా దేవాలయంలో బాబా ను దర్శించుకున్న అనంతరం కాలనీ సంక్షేమ సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు అశోక్ రెడ్డి, సెక్రటరీ రవీందర్ రెడ్డి, శివ పాములు, సోములు, శ్రీనివాస్ గౌడ్, రామ్మోహన్ చార్లు వెంకటరెడ్డి, నాగేశ్వర శర్మ, కిరణ్ కుమార్, శ్రీనివాస్, వేణు గోపాల్ రెడ్డి, నరసింహ రెడ్డి, పురుషోత్తం, కనకయ్య, వాసు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ సాధన సమితి నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించిన బుర్ర శ్రీనివాస్ గౌడ్



**షణ్ముఖ వెలుగు అడ్డ గూడూరు ప్రతినిధి జనవరి 05:** బీసీ రిజర్వేషన్ సాధన సమితి సబ్ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండరు ను ఆదివారం బిసి సంఘం నాయకులతో కలిసి అడ్డ గూడూరు మండల కేంద్రంలో బీసీ సంఘం రాష్ట్ర వ్యవస్థాపకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్య 77 సంవత్సరాలు దాటిన బీసీలు ఇంకా పేదరికం ఆకలి నిరుద్యోగం నయ వంచన దోపిడీకి గురవుతున్నారని ఇంకా 27 కులాలు సంచార జాతులుగా జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రానున్న స్థానిక, మున్సిపల్ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బీసీలు పోటీ చేసి తమ సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి తుప్పతి బీరప్ప జిల్లా నాయకులు కలిమెల నరసయ్య బాలెంల మల్లయ్య పనికేర సత్యనారాయణ తుప్పతి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## కేరళా కు చెందిన అనూప్ నంభోత్రి రాఖాడి గురు స్వామిని సన్మానించిన ఆలయ కమిటీ



**షణ్ముఖ వెలుగు స్టేట్ బ్యూరో రాము అల్లాడి హైదరాబాదు జనవరి 05 :** కేరళ రాష్ట్రానికి చెందిన గురు స్వామి అనూప్ నంభోత్రి రాఖాడి ని ఆదివారం రోజున కరీంనగర్ పట్టణంలోని కిసాన్ నగర్ లో ఉన్న శ్రీ విజయదుర్గా దేవి దేవాలయ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గురు స్వామి అనూప్ నంభోత్రి రాఖాడి ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇట్టి కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు డాక్టర్ వసంతరావు (రాజన్న సిరిసిల్ల జిల్లా డిఎం అండ్ హెచ్ఓ ) రామ్ శంకర్ సంతోష్ సత్యం,
హరి హర చారి తదితరులు పాల్గొన్నారు.

### జర్నలిస్టుల సమస్యలపై పోరాడే

# అతి పెద్ద యూనియన్ టీయూడబ్ల్యూజే (ఐజేయూ)

రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధు గౌడ్



**షణ్ముఖ వెలుగు పెబ్బేరు ప్రతినిధి జనవరి 05:** జాతీయ రాష్ట్ర స్థాయిలో జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడే యూనియన్ ఐజేయూకు అనుబంధంగా ఉన్న టీయూడబ్ల్యూజే అని సంఘం రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధు గౌడ్ అన్నారు. ఆదివారం పెబ్బేరు పట్టణంలో నిర్వహించిన పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు ఉమ్మడి మండల విలేకరులు వారి సమస్యలను రాష్ట్ర, జిల్లా నాయకులకు తెలియజేశారు. ఈ సందర్భంగా మధు గౌడ్ మాట్లాడుతూ.. తాను పూర్వ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నప్పుడే ప్రైవేట్ స్కూల్స్ లో చదివే పిల్లలకు ఉచిత విద్య విషయంలో అప్పటి డీఈవో సుశాంద్ర రావు తో మాట్లాడి ప్రొసీడింగ్స్ ఇప్పించానని చెప్పారు. అలాగే ఎంతో మంది పాత్రికేయులకు అక్రిడిటేషన్ లతో సంబంధం లేకుండా వైద్యం కూడా ఉచితంగా చేయించామని తెలిపారు. వైద్య విభాగానికి ఒక ప్రధాన సభ్యున్ని కూడా జిల్లా హెడ్ క్వార్టర్ లో నియమించామని గుర్తు చేశారు. ఇక ఇండ్ల స్థలాల విషయంలో రాష్ట్రం లోనే పెబ్బేరు మొదటి స్థానంలో ఉన్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. దీనికి కారణం కూడా టీయూడబ్ల్యూజే అని చెప్పారు. చిన్న చిన్న పొరపాట్లు ఏదైనా జరిగినా కూడా సరి చేసుకుని యూనియన్ ను ముందుకు నడిపించాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి సమస్యను రాష్ట్ర ప్రభుత్వంతో గళమెత్తి జర్నలిస్టులకు కావలసిన విద్య, వైద్యం, అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలపై మొదటి నుంచి కొట్లాడి ఇప్పించిన ఏకైక యూనియన్ మనదే అని పునరుద్ఘాటించారు. ప్రస్తుతం ఉన్న రాష్ట్ర నాయకులు క్షుణ్ణంగా చర్చించి వర్కింగ్ జర్నలిస్టులకు అందరికీ అక్రిడిటేషన్ వచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నామని, అర్హత గల ప్రతి ఒక్కరికి కార్డులు వస్తాయని అన్నారు. ఇప్పుడు వచ్చే అక్రిడిటేషన్ కార్డులో 3 ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. ఒక కార్డుతో అన్ని వసతులు కల్పించే విధంగా ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ ఎంతో కృషి చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ తెలియజేశారు. పెబ్బేరు కు మొదటి నుంచి కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని, జిల్లాలోనే పెబ్బేరు లో ప్రెస్ క్లబ్ ను ఓ క్రమశిక్షణ మార్గం వైపు తీసుకెళ్తూ వార్తలు రాసే వారికే ప్రాముఖ్యత ఇస్తూ ముందుకు తీసుకెళుతున్న ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బాల వర్ధన్ కు వారి బృందానికి అభినందనలు తెలియజేశారు. అలాగే సీనియర్ పాత్రికేయులకు రాష్ట్రంలో జిల్లాలో ప్రాధాన్యత ఇస్తానని మాటిచ్చారు. కార్యక్రమం అనంతరం మొట్టమొదటిసారిగా పెబ్బేరు కొచ్చిన మధు గౌడ్ ను శాలువాతో పెబ్బేరు, శ్రీరంగాపూర్ విలేకరులు ఘనంగా సన్మానించారు. అనంతరం సీనియర్ పాత్రికేయులకు కూడా విలేకరులు సన్మానం నిర్వహించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల విలేకరులకు పెబ్బేరు, శ్రీరంగాపూర్ ప్రెస్ క్లబ్ ల అధ్యక్షులు బాలవర్ధన్, రంగస్వామి లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఊషన్న, బాలస్వామి, పోలిశెట్టి బాలకృష్ణ, పొర్ణ రెడ్డి, ప్రశాంత్, మాధవరావు, వెంకటన్న గౌడ్, రాజు, మణ్యం, విజయ్, వహీద్, నర్సింహా రాజు, రవికాంత్, అంజి, రమేష్ శెట్టి, శ్రీనివాస్, బాలరాజు, రవీందర్ గౌడ్, గోరటి రమేష్, విజయ్ కుమార్, కిరణ్ కుమార్ గౌడ్, రాజేంద్రప్రసాద్ గోపాలకృష్ణ, పరుశురాముడు, చిరంజీవి ఈశ్వర్ శివ రాజు తరుణ్ అతీక్ తదితరులు పాల్గొన్నారు.

# కెరియర్ కౌన్సిలింగ్ సెమినార్ లో పాల్గొన్న బండారి లక్ష్మారెడ్డి

స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి



**షణ్ముఖ వెలుగు కాప్రా సర్కిల్ ప్రతినిధి జనవరి 05:** మీర్ పేట్ హెచ్ బీ కాలని డివిజన్ పరిధిలోని తిరుమల నగర్ కాలనీలోని జీహెచ్ఎంసీ గ్రౌండ్ లో శ్రీ సాయి ఎడ్యుకేషనల్ అకాడమీ నిర్వాహకులు ప్రసాద్ ఆధ్వర్యంలో డైరెక్టర్ నానో ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ కెరియర్ కౌన్సిలర్ అండ్ మోటివేషనల్ స్పీకర్ వై.శ్రీనివాస్ ప్రేరణాత్మక ఉపన్యాసంతో నిర్వహించిన కెరియర్ కౌన్సిలింగ్ సెమినార్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి. ఈ కార్యక్రమానికి ముఖ్య ఉపన్యాస కర్తగా చేసిన కెరియర్ కౌన్సిలర్ వై శ్రీనివాస్ చెప్పిన మాటలు స్థానిక ప్రజలని యువతను ఎంతగానో ఆకట్టుకోగా, జీవితానికి సంబంధించి ఎలాంటి సమయాల్లో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి జీవితాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే మనలో మార్చుకోవాల్సిన విషయాలు తీసుకోవాల్సిన నిర్ణయాలు ఎలా ఉండాలి అని, నమ్మకం పట్టుదలతో ముందుకు వెళ్లాలని ప్రేరణాత్మకంగా అందరిని ఆకట్టుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో యువతకు ఇలాంటి మోటివేషన్ స్పీచ్ లు ఎంతో అవసరమని వాళ్లు విద్య, ఉద్యోగం ఇలాంటి భవిష్యత్తు నిర్ణయాల పైన ఒక నమ్మకాన్ని కల్పించుకుంటూ పట్టుదలతో ముందుకు వెళ్లే ఆస్కారం ఎంతో ఉంటుందని ఇలాంటి కౌన్సిలింగ్ సెమినార్లు నిర్వహించడం చాలా మంచి నిర్ణయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు మల్లేష్ గౌడ్, అమరేంద్ర బాబు కార్యవర్గం స్థానిక యువత కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు. [05/01, 8:34 pm] Kapra Circle Jangiti Naresh VELUGU REPORTER: కెరియర్ కౌన్సిలింగ్ సెమినార్ లో పాల్గొన్న - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి.

### కోరుట్ల లో విశ్వ హిందూ పరిషత్

# భజరంగ్ దళ్ ల ఆధ్వర్యంలో త్రిశూల్ దీక్షా



**షణ్ముఖ వెలుగు కోరుట్ల టౌన్ ప్రతినిధి జనవరి 05:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్ ల ఆధ్వర్యంలో త్రిశూల్ దీక్షా కార్యక్రమాన్ని స్థానిక ఐలాపూర్ రోడ్ లో గల పోతని భూమయ్య ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వక్త లింగం పేట ధనుంజయ్ మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని రక్షించడం ప్రతి యువకుడిని దేశభక్తుడిగా తయారు చేయడమే కాకుండా భారతదేశ రక్షణ కొరకు జాతీయ భావాలు నింపి ప్రతి కుటుంబంలో భజరంగ్ దళ్ కార్యకర్తను తయారు చేయడమే దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. డాక్టర్ రామ్ సింగ్ మాట్లాడుతూ ప్రలోభాల ద్వారా ఇతర మతం లోకి వెళ్లిన వారిని తిరిగి ఘర్ వాపసి ద్వారా స్వధర్మం హిందూ మతంలోకి తీసుకురావడమే ముఖ్య ఉద్దేశ్యమని లవ్ జిహాద్ బారి నుండి హిందూ యువతులను రక్షించడం,గో రక్షణ చేయడం,హిందూ ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారిని సన్మార్గంలో నడిచేలా చేయడం సేవా,సురక్ష,సంస్థాన్ మూడు నినాదాల ద్వారా భజరంగ్ దళ్ కార్యకర్తలు లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం త్రిశూల్ దీక్ష ద్వారా జరిగిందని ప్రభుత్వాధీనంలో ఉన్న ఎండోమెంట్ యాక్ట్ రద్దు చేయాలని దేవాలయాలకు స్వయం ప్రతిపత్తిని హిందువులకు అప్పజెప్పాలని హిందువుల దేవాలయాల్లో పనిచేస్తున్న అన్యమతస్తులకు ఎటువంటి స్థానం లేదని అన్నారు.బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివ రాములు త్రిశూల్ దీక్షా కార్యక్రమానికి హాజరైన కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు.
భజరంగ్ దళ్ కార్యకర్తలు కోరుట్ల పట్టణ పురవీధుల గుండా హనుమాన్ ధ్వజాలను పట్టుకుని జై శ్రీరామ్ నినాదాలతో
పద సంచలన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ రామ్ సింగ్, భజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివ రాములు,విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్, ప్రధాన వక్త ధనుంజయ్ ,అల్లె మధు,జిల్లా అధ్యక్షుడు పద్మాకర్,జిల్లా కార్యదర్శి గజం రాజు,జిల్లా ఉపాధ్యక్షులు పోహార్ తుకారాం,జిల్లా భజరంగ్ దళ్ కన్వీనర్ రోహిత్ ,కో కన్వీనర్ మనోహర్,చెట్ పల్లి శంకర్, కోయిల్ కర్ శివ ,గొడికె విజయ్,వెంకటేష్,జయ ప్రకాష్,వివిధ హిందూ సంస్థల సంఘాల నాయకులు కార్యకర్తలు బిజెవైఎం బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సమస్యలతో వచ్చే ప్రజలను ఆదుకోవాలి

ప్రజల మన్ననలు పొందాలి

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలలోకి తీసుకెళ్లాలి

జిల్లాలో గ్రూప్ 4 ద్వారా రెవిన్యూ శాఖ లో 47 మందికి ఉద్యోగాలు

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

షణ్ముఖ వెలుగు సూర్యాపేట ప్రతినిధి జనవరి 05: సమస్యలతో వచ్చే ప్రజలకు సహాయం చేస్తూ వారిని ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఇటీవల టి జి పి ఎస్ సి ద్వారా ఉద్యోగం పొందిన 47 మందికి కౌన్సిలింగ్ నిర్వహించి రెవిన్యూ శాఖ లో పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో కష్టపడి ఉద్యోగం సాధించినందుకు అభినందనలు తెలిపారు.రెవిన్యూ కార్యాలయాలకి వచ్చే ప్రజలతో మంచిగా ప్రవర్తించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చివరి వ్యక్తికి చేరే విధంగా కృషి చేయాలని,కార్యాలయాల్లో సమయ పాలన పాటించాలని, ఎలాంటి అత్యాశ కు పోకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపరింటెండెంట్ పద్మారావు సిబ్బంది,అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## చెంగిచెర్ల రెడ్డి సంఘం క్యాలెండర్ ను

# ఆవిష్కరించిన ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి





**షణ్ముఖ వెలుగు సిటీ ప్రతినిధి జనవరి 05 :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్ల రెడ్డి సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం రోజున విద్యా జ్యోతి హైస్కూల్ ప్రాంగణంలో స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి బోడుప్పల్ కార్పొరేషన్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవి గౌడ్ ల చేతుల మీదుగా క్యాలెండరు ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ జిల్లెల సంజీవరెడ్డి, కార్పొరేటర్ కొత్త చందర్ గౌడ్, బింగి జంగయ్య, మోదుగుల శేఖర్ రెడ్డి,ఎల్ల దీపకరన్ రెడ్డి, రెడ్డి సంఘం ప్రతినిధులు బి శ్రీనివాస్ రెడ్డి,కె శశిధర్ రెడ్డి, రామ్ రెడ్డి,సురేఖ వెంకట్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, రఘు పాల్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి,రఘు తిరుపతి రెడ్డి, శేఖర్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి,తిరుపతి రెడ్డి, పురుషోత్తం రెడ్డి,మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తొలి ఉపాధ్యాయురాలు

# సావిత్రిబాయి పూలే కు ఘన నివాళి





- స్త్రీ విద్యా వికాసానికి నాంది పలికిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే
- ఆమె జయంతిని రాష్ట్ర ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం హర్షణీయం
- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య

**షణ్ముఖ వెలుగు సిటీ ప్రతినిధి జనవరి 05 :**బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 307వ ఆదివారం జ్ఞాన మాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అదే విధంగా ప్రముఖ సంఘ సంస్కర్త,భారత దేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ ఎన్నో అవమానాలను భరించి మహిళా విద్యా వికాసానికి పునాది వేసి తన భర్త జ్యోతిరావు పూలే అండతో పాఠశాలను ప్రారంభించి స్త్రీలకు విద్య నేర్పిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని, ఆమె జయంతి జనవరి 3 వ తేదీని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నత్తి మైసయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు . ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య ,రాపోలు శ్రీరాములు,గరుగుల యాకయ్య, యేసు రాజు, శ్రీనివాస్, సగ్గు హరిబాబు, సవరపు బయన్న, కంచి సతీష్ తదితరులు పాల్గొన్నారు.


# ఆర్థిక సాయం కాదు.. ప్రోత్సాహం

-మొదటిపేజీ తరువాయి

మెయిన్స్ ఉత్తీర్ణత సాధించిన 20 మందికి ఆర్థిక సాయం అందజేశారు. సివిల్స్ ఇంటర్వ్యూ కు ఎంపికైన ఒక్కొక్కరికి రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. సింగరేణి ఆధ్వర్యంలో సివిల్స్ అభ్యర్థులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసమే తెలంగాణ సాధించుకున్నామని చెప్పారు. గత పదేళ్లలో ఉద్యోగాల భర్తీ లేకపోవడంతో నిరుద్యోగులు ఎంతో నష్టపోయారని .. అలాంటి పరిస్థితుల్లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు.

సివిల్స్‌లో తెలంగాణ రాష్ట్ర అభ్యర్థులు ఎక్కువ మంది రాణించాలని తమ ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. బీహార్ నుంచి అత్యధికంగా సివిల్స్‌లో రాణిస్తున్నారని అన్నారు. అలాంటి ప్రత్యేక శ్రద్ధ తెలంగాణ రాష్ట్రంలో కూడా ఉండాలని, వారికి ఆర్థికంగా సహకారం అందించాలని రాజీవ్ సివిల్స్ అభయహస్తం ద్వారా రూ.లక్ష సాయం అందిస్తున్నామని ప్రకటించారు. ఇది ఆర్థిక సాయం కాదు%ౌ% ప్రభుత్వం వారికి అందిస్తున్న ప్రోత్సాహంగా భావించాలని అన్నారు. కష్టంతో కమిట్మెంట్ ఉంటేనే విజయం వరిస్తుందని చెప్పారు. ఇంటర్వ్యూకు వెళ్లే ప్రతీ ఒక్కరూ సివిల్స్‌లో సెలెక్ట్ అవ్వాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మొదటి ఏడాదిలోనే 55143 ఉద్యోగ నియామకాలు చేపట్టామని గుర్తుచేశారు. ఈ విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు.

14 ఏళ్లుగా గ్రూప్ 1 పరీక్ష నిర్వహించలేని.. కానీ తాము అడ్డంకులను, కుట్రలను అధిగమించి 563 గ్రూప్ 1 ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించామని ఉద్ఘాటించారు. మార్చి 31 లోగా 563 గ్రూప్ 1 ఉద్యోగాల నియామకాలను పూర్తిచేయబోతున్నామని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం ఆలోచించేది యువత భవిష్యత్ కోసమే అని చెప్పారు. సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులను అన్నిరకాలుగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. దేశంలో అత్యధికంగా మన రాష్ట్రం నుంచి సివిల్స్‌లో ఎంపికవుతారని గర్వంగా చెప్పుకునే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ విశ్వనగరంగా ఎదుగుతోందని అన్నారు. గ్లోబల్ సిటీ హైదరాబాద్‌లో అవకాశాలు ఎక్కువ అని చెప్పారు. తెలంగాణలో



పెట్టుబడులకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. తెలంగాణకు అత్యధిక పెట్టుబడులు రావాలని చెప్పారు. ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. తమ ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్తుందని అన్నారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

అత్యంత వెనుకబడిన బిహార్ నుంచి సివిల్స్‌కు అత్యధికంగా ఎంపికవుతున్నారు. బిహార్‌లో ప్రత్యేక శ్రద్ధ పెట్టడం వల్లే ఎక్కువ మంది సివిల్స్‌కు ఎంపికవుతున్నారని సీఎం రేవంత్ అన్నారు. అలాంటి సహకారం అందించాలనే ఆలోచనతోనే సివిల్స్ అభ్యర్థులకు ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు. ఇది ఆర్థిక సాయం కాదు. అభ్యర్థులకు అందిస్తున్న ప్రోత్సాహంగా భావించాలన్నారు. సెలెక్ట్ అయిన అభ్యర్థులు ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా రాష్ట్రానికి సేవ చేయాలన్నారు.

ఏడాదిలోనే 55వేల 143 ఉద్యోగాలు ఇచ్చాం

గ్రూప్ 1 సహా అనేక ఉద్యోగాల భర్తీ చేస్తుంటే.. నిరుద్యోగులను రెచ్చగొట్టి కేసులు వేసి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని సీఎం రేవంత్ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 55వేల 143 ఉద్యోగాలు ఇచ్చాం. గతంలో ఎన్నడూ లేని విధంగా 563 గ్రూప్ 1 ఉద్యోగ నియామకాలు చేపట్టామన్నారు. ఇన్ని ఉద్యోగాలు ఇస్తుంటే తట్టుకోలేక.. ప్రతిపక్షాలు అడ్డుకునే కుట్ర చేస్తున్నాయని సీఎం రేవంత్ ఆరోపించారు. గ్రూప్ 1పై కుట్రలన్నీ ఛేదించి పరీక్షలు నిర్వహించాం. మార్చి 31 లోపు ఈ నియామకాలు పూర్తి చేస్తామన్నారు సీఎం రేవంత్.

ఎక్కువ మంది రాణించాలనే ఆలోచనతో ప్రోత్సాహం

గత పదేళ్లలో ఉద్యోగాల భర్తీ లేకపోవడంతో నిరుద్యోగులు ఎంతో నష్టపోయారని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. ఈ ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేసుకుంటూ వస్తోందన్నారు. సివిల్స్‌లో మన రాష్ట్ర అభ్యర్థులు ఎక్కువ మంది రాణించాలనే ఆలోచనతో ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఏదైనా సాధించాలనే తపన, కష్టంతో కూడిన కమిట్మెంట్ ఉంటేనే విజయం వరిస్తుందని ఈ సందర్భంగా అభ్యర్థులకు సూచించారు. ఇంటర్వ్యూకు వెళ్లే ప్రతీ ఒక్కరూ సివిల్స్‌లో సెలెక్ట్ కావాలని ఆకాంక్షించారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్ ను సన్మానించి న కల్వకోట యాదవ సంఘం



**షణ్ముఖ వెలుగు మేడిపల్లి ప్రతినిధి జనవరి 05:** జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కల్వకోట గ్రామానికి చెందిన యాదవులు మేడిపల్లి మండల మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ యాదవ్ డైరెక్టర్ మొబిన్ పాషా లను ఘనంగా సన్మానించారు. మేడిపల్లి మండల మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి యాదవులకు ఇచ్చినందుకు వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు యాదవ సామాజిక వర్గం ధన్యవాదాలు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో కల్వకోట తాజా మాజీ సర్పంచు ఆదే లక్ష్మి రాజం, ఆదే రవీందర్, ఆదే రమేష్ , మహేందర్, మ్యాకల దుబ్బయ్య, తాలూకా అంజయ్య, రాచర్ల అంజయ్య కుల సంఘం సభ్యులు పాల్గొన్నారు

**భీమారం మండల కేంద్రానికి విద్యుత్తు సబ్ స్టేషన్ మంజూరు**

భీమారం మండల కేంద్రానికి 33/11 కేవీ విద్యుత్తు సబ్ స్టేషన్ ను మంజూరు చేయించిన వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు మండల రైతులందరి తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసిన భీమారం మండల అధ్యక్షులు టి పిసిసి గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి మేడిపల్లి మండల అధ్యక్షులు ఏనుగు రమేష్ రెడ్డి మేడిపల్లి మండల మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ యాదవ్ లు కృతజ్ఞతలు తెలిపారు

## ఉప్పల్ నియోజకవర్గంలో సీఎం ను కలిసిన ఆకారపు అరుణ్ పటేల్



**షణ్ముఖ వెలుగు సిటీ ప్రతినిధి జనవరి 05:** ప్రముఖ పారిశ్రామికవేత్త, సమాజ సేవకుడు ఇటీవల కాలం చేసిన మన్నె సుబ్రహ్మణ్యం కు సీఎం రేవంత్ రెడ్డి, మందముల పరమేశ్వర్ రెడ్డి లు నివాళులు అర్పించారు. మన్నె సుబ్రహ్మణ్యం పెద్ద కర్మ ఆదివారం చర్లపల్లి లోని శ్రీ కృష్ణ కన్వెన్షన్ లో జరిగింది. పెద్ద కర్మకు ఉప్పల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ ఉప్పల్ నియోజకవర్గం సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ఇంకా ఎన్నాళ్లు తప్పించుకుంటారు.. కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు ఫైర్

హన్మకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, ఇతర నాయకులను నిర్బంధించడాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. రైతు భరోసా పేరిట కాంగ్రెస్ చేసిన మోసంపై వరంగల్ పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి రిప్రజెంటేషన్ ఇచ్చే ప్రయత్నం చేస్తే అడ్డుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ. 7,500 ఇస్తామని చెప్పి మాట తప్పిన మీ తీరును చూసి యావత్ తెలంగాణ రైతాంగం చీదరించుకుంటున్నదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు విమర్శించారు. ఎక్కడ రైతులు తిరగబడతారో అని.. మంత్రుల పర్యటనల్లో భారీగా పోలీసులను మోహరించి ఎన్నాళ్ళు తప్పించుకుంటారని ప్రశ్నించారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా మిమ్మల్ని ఎండగడుతూనే ఉంటామని.. ఎక్కడిక్కడ నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. పెద్ది సుదర్శన్ రెడ్డితో పాటు ఇతర బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ఎన్ని ఇబ్బందులున్నా.. రుణ మాఫీ చేస్తాం

-మొదటిపేజీ తరువాయి

పేరుతో భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ. 12 వేల ఇస్తామన్నారు. బీఆర్ఎస్ ఎన్ని కుట్రలు చేసినా తమ పథకాలు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఆపబోమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ గత 10 ఏళ్లలో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే రూ. లక్ష రుణమాఫీ సైతం చేయ లేక పోయారని మండిపడ్డారు. బీఆర్ఎస్ రూ.7 లక్షల అప్పు చేసి కూడా రుణమాఫీ చెయ్య లేక చేతులు ఎత్తేసిందని ఎద్దేవా చేశారు. తాము ఇచ్చిన హామీలను నిబద్ధతతో కచ్చితంగా అమలు చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రూ. 2 లక్షల లోపు ఉన్న రైతులకు రుణ మాఫీ కాకపోతే తప్పకుండా చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీష్ రావు, కేటీఆర్‌లు అడ్డగోలుగా మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిద్దరి మాటలు చూస్తుంటే.. కడుపు తరుక్కుపోతుందని వ్యంగ్యంగా అన్నారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 56 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. ఇక రైతులకు బోనస్ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. కానీ ఈ అంశంపై బీఆర్ఎస్ పార్టీ.. తన సోషల్ మీడియాతోపాటు తన పత్రికలో విషప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు. ప్రతి ఎకరాకు ఎలాంటి షరతులు లేకుండా తమ ప్రభుత్వం రైతు భరోసా ఇస్తుందని ప్రకటించారు. ఈ ఏడాది జనవరి 26వ తేదీన నుంచి రైతు భరోసా పంపిణీ చేస్తామన్నారు. ఎవరు అడ్డు పడిన.. ఎన్ని కుట్రల చేసిన రైతు భరోసా పథకాన్ని మాత్రం అమలు చేసి తీరుతామని చెప్పారు. రైతుల పక్షానే తమ ప్రభుత్వం నిలబడుతోందన్నారు. కాంగ్రెస్ చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని కార్యకర్తలకు ఈ సందర్భంగా భట్టి విక్రమార్క్ పిలుపు నిచ్చారు.

## రైతులకు మద్దతుగా బీఆర్ఎస్

-మొదటిపేజీ తరువాయి

అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో రైతులకు మద్దతుగా నిరసనలు తెలుపుతామని తెలిపారు. హార్టికల్చర్ రైతులకు రైతు భరోసా ఇస్తారా ఇవ్వరా అనే దానిపై క్లారిటీ లేదని అన్నారు. ఉద్యోగులకు భూమితో సంబంధం లేకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గండం దాటేందుకు రైతు భరోసాపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని విమర్శించారు. రైతుబంధు పథకం ఉండాలా వద్దా అనేది రైతులు నిర్ణయం తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ అడ్డుకోండి, నిలదీయండి అని పిలుపునిచ్చారు. నమ్మి ఓటేసిన పాపానికి పచ్చి మోసానికి పాల్పడ్డ ఈ కాంగ్రెస్‌ను రైతన్నలు పాతరేస్తారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ చేసిన దానికి మోసం అనే పదం చిన్నదైపోతది. దగా, నయవంచన పదాలు కూడా సరిపోవని విమర్శించారు. కాంగ్రెస్ రైతాంగానికి చేసిన ఈ ద్రోహం.. తెలంగాణ చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలిపోతుందని వ్యాఖ్యానించారు. కపట నాటకాలకు, నోరు తెరిస్తే అబద్ధాలకు, బూటకపు వాగ్దానాలకు కేరాఫ్ కాంగ్రెస్/రేవంత్ అని రైతాంగానికి అర్థమైపోయిందని అన్నారు.



# హాట్ లుక్‌లో పొలిమేర నటి కామాక్షి భాస్కర్ల

పొలిమేర ఫ్రాంచైజీతో నటిగా సూపర్ పాపులారిటీ తెచ్చుకుంది హైదరాబాదీ ముద్దుగుమ్మ కామాక్షి భాస్కర్ల ఈ భామ విరూపాక్ష, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, రౌడీ బాయ్స్, ఓం భీమ్ బుష్ సినిమాలతో మంచి పాపులారిటీ సంపాదించుకుంది. 'సైతాన్' వెబ్‌సిరీస్‌లో బోల్డ్‌గా నటించి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచిన ఈ భామ బోల్డ్ క్యారెక్టర్లు చేయడానికి రెడీ. అమాయక పాత్ర అయినా, బోల్డ్ క్యారెక్టర్ అయినా నటికి ఒకటేనని.. కథానుగుణంగా పాత్ర ఉంటుందంటూ దర్శకనిర్మాతల దృష్టిని తనవైపునకు తిప్పుకుంటోంది. పర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్ పాత్రలు చేస్తూ నటిగా తనను తాను నిరూపించుకునే ప్రయత్నంలో ఉన్న ఈ భామ తాజాగా హాట్ లుక్‌లో కనిపిస్తూ కుర్రకారుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. మోడ్రన్ వేర్‌లో హొయలుపోతూ కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది. ఈ ఫొటోలు నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి.

## సినిమాల్లోకి అకీరా నందన్ ఎంట్రీ

పెళ్లి, పిల్లల తర్వాత చాలా గ్యాప్ తీసుకున్న రేణూ దేశాయ్ 2023 లో రవితేజ టైగర్ నాగేశ్వర రావు సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చింది. ఇందులో ఆమె పాత్రకు మంచి పేరు వచ్చింది. దీంతో రేణు మళ్లీ సినిమాల్లో బిజీ అవుతుందనుకున్నారు. అయితే అలాంటిదేమీ జరగలేదు. టైగర్ నాగేశ్వర రావు విడుదలై ఏడాదిన్నర గడిచినా ఇప్పటివరకు ఏ కొత్త సినిమాను అనౌన్స్ చేయలేదీ అందాల తార. ప్రస్తుతం సామాజిక సేవా కార్యక్రమాలతో రేణూ దేశాయ్ బిజి బిజీగా ఉంటోంది. అనాథ పిల్లలు, పర్యావరణం, మూగ జీవాల సంరక్షణ కోసం తన వంతు కృషి చేస్తుంటుంది. అలాగే తన ఫాలోవర్స్‌ని కూడా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని సోషల్ మీడియా వేదికగా కోరుతూ ఉంటుంది. ఇటీవలే మూగ జీవాల కోసం తన కూతురు ఆద్య పేరు మీదగా ఒక ఎన్‌జీవోను కూడా స్థాపించింది రేణూ దేశాయ్. కాగా చాలా రోజుల తర్వాత విజయవాడకు వచ్చిన ఆమె పలు కార్యక్రమాల్లో పాల్గొంది. మొదట ఇంద్ర కీలాద్రి అమ్మారిని దర్శించుకున్న ఆమె సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొంది. ఆ తర్వాత తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమానికి కూడా హాజరయ్యిందామె. ఈ సందర్భంగా రేణూ దేశాయ్‌కు ఒక ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. 'మీ కుమారుడు అకీరా నందన్ సినిమాల్లోకి ఎప్పుడు వస్తున్నాడు' అని రేణూను అడిగారు. దీనికి స్పందించిన ఆమె..


' ఈ సమయం కోసం నేను కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఒక తల్లిగా మీ అందరికంటే నాకే ఎక్కువ ఆసక్తి ఉంటుంది. అతను ఎప్పుడు ఓకే అంటే అప్పుడే. అకిరా నందన్ ఇష్టంతోనే సినిమాల్లోకి రావాలి. అంతవరకు వెయిట్ చేయండి' అని చెప్పుకొచ్చింది రేణూ దేశాయ్. కాగా పవన్ కల్యాణ్ నటిస్తోన్న ఓజీ సినిమాలో అకీరా నందన్ నటిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సుజిత్ తెరకక్కిస్తోన్న ఈ గ్యాంగ్ స్టర్ యాక్షన్ డ్రామాలో పవన్ చిన్నప్పటి రోల్ అకీరా పోషిస్తున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.



## షాహిద్ కపూర్ 'దేవా' టీజర్ రిలీజ్

బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం దేవా  బిగ్ బీ అమితాబ్ బచ్చన్ దేవా సినిమాను ప్రేరణగా తీసుకుని ఈ చిత్రం రూపొందుతుండగా.. మలయాళ దర్శకుడు రోషన్ ఆండ్రోస్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. పూజ హెగ్డే, పావేల్ గులాటి తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం జనవరి 31న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. టీజర్ చూస్తుంటే.. షాహిద్ రూత్‌లెస్ పోలీస్‌గా అలరించబోతున్నట్లు తెలుస్తుంది. కాగా ఈ టీజర్‌ను మీరు చూసేయండి.



## బాలకృష్ణ 'డాకు మహారాజ్' ట్రైలర్ రిలీజ్

నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం డాకు మహారాజ్ వాల్తేరు వీరయ్యతో గతేడాది బ్లాక్ బస్టర్ అందుకున్న బాబీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్‌లో బాలయ్య డాకు మహారాజ్ పాత్రతో పాటు నానాజీ అనే డ్యూయల్ రోల్‌లో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. ఫుల్ యాక్షన్ వోల్టేజీతో ఉన్న ఈ ట్రైలర్ చూస్తుంటే బాలయ్య మరో హిట్ కొట్టబోతున్నాడని తెలుస్తుంది.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT NO.51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN: 523225. Mobile: 9494177939, RNI: APTEL 16448. e-mail: rkreport9@gmail.com. E-Paper: shanmukhavelugu.com